# వైఎస్ఆర్-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



బుధవారం 04 డిసెంబర్ 2024


## కేజీబీవీల అభివృద్ధికి రూ.2.52 కోట్ల నిధులు మంజూరు

రాయచోటి, డిసెంబర్ 3ప్రభాత వార్త



అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని కేజీబీవీల అభివృద్ధికి రూ.2.52 కోట్ల నిధులు మంజూరు అయినట్లు రాష్ట్ర రవాణా,యువజన మరియు క్రీడా శాఖ మంత్రి మరియు జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాటలు తప్ప సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. కేజీబీవీ పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. కంప్యూటర్, లైబ్రరీ, ఆర్ట్ క్రాఫ్ట్ రూములు లేక విద్యార్థులు చదువుకోవడానికి సరైన పరిస్థితులు లేవు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న పిదప నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలలో పర్యటించిన సమయంలో ఈ విషయాన్ని మంత్రివర్యులు పరిశీలించారు. అదే సమయంలో కేజీబీవీ ఉపాధ్యాయులు విద్యార్థులు కూడా తమ సమస్యలను మంత్రివర్యులకు విన్నవించారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు తప్పకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. ఈ మేరకు జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో రాయచోటి నియోజకవర్గం లోని 6 కేజీబీవీ పాఠశాలల్లో 11 పనులకు గాను రూ. 2.52 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. ఈ నిధులతో రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం, గాలివీడు, సంబేపల్లి మండలాలలోని కేజీబీవీ లలో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ఆర్ట్ క్రాఫ్ట్ రూములు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, ప్రహరీ గోడల పనులను చేపట్టడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు

## ఫించ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

రాజంపేట అర్బన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త

ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు నదిలోకి నీటిని విడుదల చేశారు. కేంద్ర జల సంఘం ఆదేశాల మేరకు నీటిని పూర్తిస్థాయిలో పింఛా ప్రాజెక్టులో నిలువ చేస్తున్నారు. ఇన్ ఫ్లో 1072 క్యూసెక్కులు వస్తుండగా నదిలోకి 3779 క్యూసెక్కులు నీరు లోతట్టుకు విడుదల చేశారు.మరోవైపు అన్నమయ్య ప్రాజెక్టుకు ఈనిరు చేరే అవకాశాలు ఉండటంతో ఇన్ ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది. ఉదయం ప్రాజెక్టుకు వరద వస్తుండడంతో అన్నమయ్య ప్రాజెక్టు అధికారులు వరదనీడిని లోతటి ప్రాంతానికి విడుదల చేశారు.



# పనుల పండుగ గ్రామాలలో రోడ్లు నిండుగా

**రాష్ట్రవ్యాప్తంగా రూ.4500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులతో పల్లెలకు మహర్దశ**

**అన్నమయ్య జిల్లాలో రూ 62 కోట్లతో 1,33,967 మీటర్ల మేర సిసి, బీటీ రోడ్ల నిర్మాణం నిమిత్తం 803 పనులు మంజూరు**

**జిల్లాలో ఇప్పటికే 718 పనులు ప్రారంభం 289 పనులలో 38,370 మీటర్ల పొడవుతో పూర్తయిన సిసి, బీటి రోడ్లు**

**జిల్లాలో సిసి, బీటి రోడ్లతో గ్రామాలకు నూతన శోభ**

**కూటమి ప్రభుత్వం రాకతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం**



రాయచోటి డిసెంబర్ 3 ప్రభాతవార్త

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. పల్లెలకు పూర్వ వైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్... ఖిపల్లె పండుగఖి పేరుతో అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. తద్వారా పల్లెలలో పనుల పండుగ సందడి ప్రారంభమైంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టి సంక్రాంతికి ముందే పల్లెల్లో అసలైన పండుగ వాతావరణం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. గ్రామాల అభివృద్ధికి ఒక కీలక ముందడుగు వేసింది మన చంద్రబాబు ప్రభుత్వం. విజనరీ ఉన్న సమర్థుడైన నాయకుని పరిపాలనలో అభివృద్ధిలో వస్తున్న మార్పుపై అన్నమయ్య జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఆగస్టు 23న గ్రామసభల్లో తీర్మానాలు

ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13వేల 326 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలను ప్రభుత్వం నిర్వహించింది. దేశంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఈ మేరకు అన్నమయ్య జిల్లాలోని 501 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరిగింది. ఆయా పంచాయతీల్లో తీర్మానాలు చేసి తీసుకున్న నిర్ణయాల మేరకు పల్లె సీమల్లో సిమెంటు రహదారులు, బిటి రహదారులు, ప్రహరీలు, గోకులాలు, పారిశుద్ధ పనులు చేపట్టాలని నిర్ణయించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే ఈ పనులకు ప్రభుత్వం నుంచి పరిపాలనపరమైన అనుమతి, సాంకేతిక ఆమోదం లభించింది. గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలు అమలుచేయడానికి అన్ని శాఖలను జిల్లా యంత్రాంగం ద్వారా సమన్వయం చేస్తున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్వయంగా ప్రభుత్వ శాఖల సమన్వయాన్ని పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేసి పల్లెలకు అసలైన పండుగ తీసుకురావాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం.

### పల్లెలకు పండుగే

ఈ మేరకు అభివృద్ధి పనులు చేపట్టి.. పల్లెలకు పూర్వవైభవం తీసుకురావాలనే ఆలోచనతో కూటమి సర్కార్ తొలి అడుగు వేసింది. "పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు" పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టి అక్టోబర్ 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలలో అభివృద్ధి పనులకు అంకురార్పణ చేశారు. ఖిపల్లెపండుగఖి వారోత్సవాల్లో భాగంగా రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, మరో 500 కిలోమీటర్ల తారు రోడ్లు, 25 వేల గోకులాలు, 10 వేల వాన నీటి సంరక్షణ కందకాలతో పాటు గ్రామాల్లో అవసరమైన అనేక పనులను ప్రభుత్వం చేయడానికి సంకల్పించింది.

ఈ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, గ్రామ ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించడానికి, గ్రామీణ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపరిచేందుకు పెద్ద పునాది వేస్తుంది. ప్రజలంతా కలిసి తమ గ్రామాల్లో కావాల్సిన అభివృద్ధి పనులను వారే తీర్మానించుకున్నారు. దీనిలో ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమీ లేదు. శంకుస్థాపన చేసిన చోటే ఆయా పనుల పూర్తి వివరాలు ఉండాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పూర్తి పారదర్శకతతో పనులు జరగాలనేదే ప్రభుత్వ లక్ష్యం. దీనివల్ల గ్రామాల్లో నీటి, రవాణా, వ్యవసాయ వంటి రంగాలలో గణనీయమైన మెరుగుదల సాధ్యం అవుతోంది. అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలలో భాగస్వామ్యాన్ని పెంచి, గ్రామాల్లో ఆర్థిక స్థిరత్వం సృష్టించడంలో పల్లె పండుగ కార్యక్రమం ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

### జిల్లాలో రూ 62 కోట్లతో... 1,33,967 మీటర్ల మేర సిసి,

### బీటీ రోడ్ల నిర్మాణం కొరకు 803 పనులకు ఆమోదం

అన్నమయ్య జిల్లాలోని 501 పంచాయితీలలో ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభలలో తీసుకున్న నిర్ణయాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు, ఆశయాలను సాధించే దిశగా జిల్లా మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో... జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా యంత్రాంగాన్ని వేగంగా సమాయుక్తం చేశారు. ఈ మేరకు పక్కా ప్రణాళికతో కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్తున్నారు. గ్రామ సభలో ఆమోదం పొందిన పనులకు సంబంధించి జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం సమన్వయంతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా అన్నమయ్య జిల్లాలో రూ 62 కోట్లతో 1,33,967 మీటర్ల మేర సిసి, బీటీ రోడ్ల నిర్మాణం నిమిత్తం 803 పనులకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సత్వరం పరిపాలనపరమైన ఆమోదపు మంజూరు ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలో 718 పనులు ప్రారంభించి... 289 పనులను పూర్తి చేయగా 429 పనులు తుది దశ ప్రగతిలో ఉన్నవి. ఇప్పటికే 40,526 మీటర్ల పొడవుతో సిసి, బీటి రోడ్లు పూర్తి చేశారు. ఇందుకుగాను ఇప్పటి వరకు రూ.22.42 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఇంకను ఉండగా 2156 మీటర్ల పొడవైన సిసి రహదారుల నిర్మాణాలు దాదాపు పూర్తి చేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని పూర్తి చేసిన ప్రతిచోట చేపట్టిన పని తెలిపే వివరాలు, ప్రదేశం, ఎక్కడి నుంచి ఎక్కడిదాకా రహదారులు నిర్మించారు, ఎంత ఖర్చు చేశారు తదితర వివరాలను కూడా పని ప్రదేశంలో "సిటిజెన్ నాలెడ్జ్ సమాచార బోర్డులు" కూడా ఏర్పాటు చేయడం జరుగుతోంది.

సిసి, బీటి రోడ్లతో అన్నమయ్య జిల్లా నందలి గ్రామాలు నూతన శోభ సంతరించుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వ రాకతో.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం శాయశక్తులా కృషి చేస్తోంది. ఇందుకు ప్రజల నుంచి కూడా పూర్తి సహకారం అందుతోంది. వారు కూడా ఈ కార్యక్రమాలలో స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నారు. ఈ సారి మట్టి రోడ్లపై కాకుండా మా గ్రామంలోని కళకళలాడుతున్న సిమెంట్ రోడ్లపై రంగురంగుల ముగ్గులతో సంక్రాంతిని జరుపుకుంటామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో వారి సీసీ, బీటీ రోడ్ల పనుల వివరాలు

**1. నియోజకవర్గం పేరు : రాయచోటి**

మొత్తం చేపట్టిన పనులు 158
అంచనా ఖర్చు.. 16.66కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు.. 26122 మీటర్లు
ప్రారంభించిన పనులు: 157
పూర్తయిన పనులు: 102
ప్రగతిలో ఉన్న పనులు..: 55
పూర్తిచేసిన సీసీ/బీటీ రోడ్ల పొడవు: 17581 మీటర్లు

**2. నియోజకవర్గం పేరు : మదనపల్లి**

మొత్తం చేపట్టిన పనులు 164
అంచనా ఖర్చు9.75కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు : 20404 మీటర్లు
ప్రారంభించిన పనులు : 163
పూర్తయిన పనులు: 68
ప్రగతిలో ఉన్న పనులు: 95
పూర్తిచేసిన సీసీ/బీటీ రోడ్ల పొడవు : 6746 మీటర్లు

**3. నియోజకవర్గం పేరు : పీలేరు**

మొత్తం చేపట్టిన పనులు 121
అంచనా ఖర్చు: 6.22కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు : 14112 మీటర్లు
ప్రారంభించిన పనులు : 120
పూర్తయిన పనులు: 43
ప్రగతిలో ఉన్న పనులు: 77
పూర్తిచేసిన సీసీ/బీటీ రోడ్ల పొడవు : 5226 మీటర్లు

**4. నియోజకవర్గం పేరు : తంబళ్లపల్లి**

మొత్తం చేపట్టిన పనులు: 123
అంచనా ఖర్చు: 6.37కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు : 12951 మీటర్లు
ప్రారంభించిన పనులు : 119
పూర్తయిన పనులు : 41
ప్రగతిలో ఉన్న పనులు: 78
పూర్తిచేసిన సీసీ/బీటీ రోడ్ల పొడవు : 3986 మీటర్లు

**5. నియోజకవర్గం పేరు : కోడూరు**

మొత్తం చేపట్టిన పనులు: 151
అంచనా ఖర్చు 16.43కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు : 46988 మీటర్లు
ప్రారంభించిన పనులు : 146
పూర్తయిన పనులు : 35
ప్రగతిలో ఉన్న పనులు: 111
పూర్తిచేసిన సీసీ/బీటీ రోడ్ల పొడవు : 6987 మీటర్లు

**6. నియోజకవర్గం పేరు : రాజంపేట**

మొత్తం చేపట్టిన పనులు: 86
అంచనా ఖర్చు: 6.46కోట్లు
సీసీ/బీటీ రోడ్ల పొడవు : 13390 మీటర్లు
ప్రారంభించిన పనులు : 13
ప్రగతిలో ఉన్న పనులు: 13

### కూటమి ప్రభుత్వంలో పరుగులు పెడుతున్న గ్రామీణ అభివృద్ధి



గత ప్రభుత్వంలో పంచాయతీలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఒక నిరంకుశతత్వ ధోరణిలో.. గ్రామీణ ప్రాంతాలలో కొంతమంది అజమానుషీలో పరిపాలన సాగింది. నేడు ఆ పరిస్థితి లేదు. గ్రామసభల తీర్మానంతో గ్రామా నికి అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నాం. రోడ్లు నిర్మిస్తున్నాం. రోడ్డు సైడ్ కాలువలు, అవెన్యూ ప్లాంటేషన్ పనులు కూడా చేస్తున్నాం. ఇందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుండడం సంతోషకరం. రికార్డు సమయంలో గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు పూర్తి చేస్తుండడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. గుర్రంకొండ మండలం నగరి హరిజనవాడ ఎల్లుట్ల పంచాయతీలో రూ 5 లక్షల నిధులతో 133 మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పుతో తూ ర్పుపల్లె చెర్లోపల్లిని అనుసంధానిస్తూ సిసి రహదారులు నిర్మించుకున్నాం. గ్రామీణ ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి, ఉప ము ఖ్యమంత్రికి మా ధన్యవాదాలు.:

**ఏపీ సర్పంచుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు ఎల్లుట్ల గ్రామ సర్పంచ్ ఎస్. లలిత.**

### విజనరీ ఉన్న సమర్థుడైన నాయకుని పరిపాలనలో



రాష్ట్రంలో గత ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా అక్టోబర్ 14 నుంచి 20 వరకు గ్రామాలలో సిమెంట్, బీటీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా 4,500 కోట్ల రూపాయలతో 30 వేల అభివృద్ధి పనులను చేపట్టి శంకుస్థాపనలు, భూమి పూజలు చేశాం. దీంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. చేపట్టిన పనులన్నింటినీ సంక్రాంతి పండుగ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారులు శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. చాలావరకు చేపట్టిన పనులు ప్రారంభోత్సవాలకు నోచుకుంటున్నాయి. రాబోయే ఐదు సంవత్సరాలలో గ్రామాలలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, మంచినీటి సమస్య పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి చేయడం జరుగుతుంది. విజనరీ ఉన్న సమర్థుడైన నాయకుని పరిపాలనలో.. రాష్ట్ర అభివృద్ధిలో వస్తున్న మార్పుపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలలోని ప్రజలందరూ ఈ కార్యక్రమాలలో భాగస్వాములు అవుతుండడం సంతోషకరం.

**: మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

### సంక్రాంతిలోగా పనులన్నీ నాణ్యతగా పూర్తి చేస్తాం:

ప్రజల కోసం తీసుకునే ఏ నిర్ణయమైనా వారి మధ్యనే జరగాలి.. వారితోనే జరగాలి.. వారి వల్లనే జరగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది ఒక మంచి సంప్రదాయం. గ్రామసభల తీర్మానాల మేరకు జిల్లాలో మొత్తంగా 1,33,967 మీటర్ల పొడవైన సిసి బిటి రోడ్లను నిర్మించాలని సంకల్పించి, ఇప్పటికే 40,526 మీటర్ల పొడవైన రహదారులను పూర్తి చేశాం. చిన్నచిన్న సాంకేతిక సమస్యలతో ఇంకనూ ప్రారంభించని పనులు కూడా త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పని పూర్తి అయిన ప్రదేశంలో సిటిజన్ నాలెడ్జ్ సమాచార బోర్డులను కూడా ఏర్పాటు చేస్తున్నాం. పల్లె పండుగ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను సంక్రాంతిలోగా నాణ్యతగా పూర్తి చేస్తాం.

# రాజంపేటలో వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం







రాజంపేట అర్బన్ , డిసెంబర్3 ప్రభాతవార్త

హరిహరసుతుడు అయ్యప్ప స్వామి గ్రామోత్సవం రాజంపేట పట్టణంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. జాతీయ రహదారిపై మణికంఠ నగర్ లో వెలసిన అయ్యప్ప స్వామి 17వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. వినాయకుడు అయ్యప్ప స్వామి సుబ్రహ్మణ్య స్వామి లకు పంచామృతాభిషేకలను నిర్వహించారు. అష్టోత్తర పూజలు చేశారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అభిషేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ పాల ప్రకాష్, కృష్ణయ్య నాయుడు, ఆలయ గురుస్వామి కొండా సత్యనారాయణ, గురుస్వాములు నాగరాజు,చంద్రమోళి, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ బాబు, వెంకటరెడ్డి, దాము ఆచారి, సుధాకర్ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ని దుశ్శాలవతో సన్మానించారు.

అనంతరం సాయంత్రం బ్రహ్మోత్సవం ప్రారంభమైంది. కన్న స్వాములు కలశాలతో స్వామి బ్రహ్మోత్సవంలో పాల్గొన్నారు. నెల్లూరు చెందిన బాలికలు కోలాటం నృత్యం ప్రజలను ఆకట్టుకుంది. పాత బస్టాండ్లో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. ఆర్ఎస్ రోడ్ , జిఎంసి క్లబ్, రెడ్డి వారి వీధి బండ్ల వీధి ప్రధాన రహదారి మీదుగా గ్రామోత్సవం సాగింది. ఈడిగ పాలెం సర్కిల్లో అయ్యప్ప స్వాములకు , భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. గ్రామోత్సవం, స్వాములకు భిక్షకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు సహకారం ఇచ్చారు.

## ఘాట్ రోడ్ లో విరిగిపడిన కొండ చరియలు

చిట్వేలి,డిసెంబర్ 3, ప్రభాతవార్త:

పెంగల్ తుఫాను తో మంగళవారం రాపూరు ఘాట్ సరిహద్దు రహదారిలో కొండ చరియలు రహదారికి అడ్డంగా విరిగిపడ్డాయి. సగం రహదారి మేర చెట్లు, రాళ్లు,మట్టితో కూడిన వ్యర్థాలు నిండిపోవడంతో వాహనాలకు ఇబ్బందిగా మారింది. అసలే పెనుశిల అభయారణ్యం,ఆపై క్రూరమృగాల సంచరించే రహదారి కావడంతో వాహనదారులు భయభ్రాంతుకు లోనయ్యారు.ఇట్టి ఇబ్బందులు తలెత్తితే మా పరిస్థితి ఏమిటని వాపోయారు. కాగా ప్రమాదకరమైన ఈ రహదారిని విస్తరించడంలో గత ప్రభుత్వం విఫలమైందని పలువురు ఆరోపిస్తున్నారు. గుత్తేదారులు అందిన కాడికి దోచుకుని నామమాత్రపు పనులతో జోబులు నింపుకున్నారన్న విమర్శలు లేకపోలేదు. కాగా రోడ్ల స్థితిగతులను గమనించి ఇబ్బందులను అధిగమించవలసిన ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదని వాపోతున్నారు. జనావాసాల మధ్య ప్రధాన రోడ్లపై ఎండిపోయిన చెట్లు నేల కూలేందుకు సిద్ధంగా ఉన్నా, ఆర్ అండ్ బి రోడ్లపై ప్రధాన వీధుల్లో నీరు నిలిచి వంకలను తలపిస్తున్నా ఈ శాఖ నుంచి స్పందన కరువైందని మండల ప్రజల ఆరోపిస్తున్నారు.



గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘాట్ రోడ్ మార్గంపై కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. రాజధానికి వెళ్లే మార్గం కావడం, నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రమాదకరమైన రహదారి మార్గాన్ని పూర్తిస్థాయిలో విస్తరించి శాశ్వత పనులను చేపడితే ప్రజలకు మేలు జరుగుతుందని మండల ప్రజలు ముకుమ్మడిగా ప్రభుత్వానికి,ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు.


శుభస్వీకరణ



కీ॥శే॥ కటారు సుబ్బరామిరెడ్డి (లాయర్) గారు
రాజంపేట సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్
మరియు అడ్వకేట్, మన్నూరు, రాజంపేట.
జననం : 12/04/1954 మరణం : 22/11/2024

చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మా అందరికీ ప్రేమానురాగాలను పంచి మా ఉన్నతికి అహర్నిశలు కృషి చేసి మా అందరి హృదయాలలో సుస్థిరసానం పొంది మా నుండి దూరమై దైవసన్నిధికి చేరినా మీ తియ్యని జ్ఞాపకాలు మరువలేము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుకుంటూ...

ఇట్లు : భార్య : వసుంధరమ్మ కుమారుడు : కటారు నాగార్జునరెడ్డి
మరియు కుటుంబసభ్యులు

పెద్దకర్మ : 04.12.2024వ తేదీ బుధవారం రాజంపేట పట్టణం, మన్నూరు యల్లమ్మ గుడి పక్కన గల తోట కళ్యాణమండపంలో జరుగును. కావున తెలుపడమైనది.

## నీటి సంఘాల ఎన్నికలకు శిక్షణ కార్యక్రమం



ప్రొద్దుటూరు రూరల్, డిశంబరు 03 ప్రభాతవార్త :
డిసెంబర్ 8న జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. శిక్షణ తరగతులకు హాజరైన పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను ఉద్దేశించి తాసిల్దార్ గంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలనువివరించారు. నీటిపారుదల శాఖ ఏ ఈ ఈ గురు మోహన్ రెడ్డి మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు ఐదవ తేదీన నోటిఫికేషన్ వెలువడుతుందని, ఎనిమిదో తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం, అదేరోజు మధ్యాహ్నం కౌంటింగ్, సాయంత్రానికి ఫలితాలు వెల్లడించి ఎన్నికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. కేసీ కెనాల్ పరిధిలోని 12 టెరిటోరియల్ కాన్స్టిట్యూషన్లకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికల సమయంలో పిఒలు ఏపీవోలు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డి రామాంజ నేయరెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఒ అరుణకుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

గాలివీడు, డిసెంబర్ 3(ప్రభాతవార్త):



మండల కేంద్రమైన గాలివీడులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దుర్గేశ్వరరాజు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రేమ, అనురాగం, శ్రద్ధ, ప్రోత్సాహం ఉంచాలని అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం అనేది ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న జరుపుకోవడం జరుగుతుందని, సమాజం మరియు అభివృద్ధి యొక్క ప్రతి స్థాయిలో వికలాంగుల హక్కులు మరియు శ్రేయస్సును ప్రోత్సహించడానికి మరియు రాజకీయ, సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక జీవితంలోని అన్ని అంశాలలో వికలాంగుల పరిస్థితిపై అవగాహన పెంచడానికి ఈ రోజు చాలా ముఖ్యమైనదని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలైన దివ్యాంగులకు బహుమతులు పాఠశాల ఉపాధ్యాయ బృందం చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ నారాయణమ్మ, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గాలివీడు, డిసెంబర్ 3(ప్రభాతవార్త):



గరుగుపల్లి, గుండ్లచెరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారిణి కె.గౌతమి ఆధ్వర్యంలో నిర్వహించారు. వరి పంట, వేరుశనగ పంట పొలాలు పరిశీలించి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల నందు పొలం పిలుస్తోంది కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. అనంతరం గరుగుపల్లి గ్రామంలోని పొలం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంది మరియు వేరుశనగ పంటల సాగు నందు తీసుకోవాల్సిన పలు మెలకువలను మరియు జాగ్రత్తలను రైతులకు వివరించినట్లు వ్యవసాయాధికారిణి గౌతమి తెలిపారు. వ్యవసాయాదికారుల సూచనలను సలహాల ద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను రాబట్టవచ్చని ఆమె రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మణి, ఉద్యానవన సహాయకులు ఫామిదాబాను, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు

గాలివీడు, డిసెంబర్ 3(ప్రభాతవార్త):
మండలంలోని మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్-9 ఆపరేటర్ ఈశ్వరరెడ్డిపై పూలికుంట గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎండీయూ ఆపరేటర్ ప్రభుత్వం మారి అయిదు నెలలు గడిచినా నిత్యావసర సరుకులు పంపిణీచేసే వాహనంపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ తొలగించకపోవడంపై ఫిర్యాదులో పేర్కొన్నారు. వాహనంపై మాజీ సీఎం ఫోటో తొలగించకపోవడంతో పాటు నిత్యావసర సరుకులు అరకిలో చక్కెర రూ.20 కిలో కందిబ్యాడలు రూ.70లకు సరుకులు అదిక ధరలకు విక్రయిస్తున్నట్లు డీటీకి దృష్టికి తెచ్చారు. కార్డు వినియోగదారులు ఈ విషయంపై అభ్యంతరం తెలపగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పిర్యాదులో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీ షాప్ డీలర్లు టోపీవలిసాబ్, రెడ్డప్పరెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొండారెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రామాంజులురెడ్డి పాల్గొన్నారు.

## హౌసింగ్ లబ్ధిదారులకు రుణాలు పంపిణీ

కలికిరి, డిసెంబరు 3, ప్రభాతవార్త:



మండల కేంద్రంలోని కలికిరి పంచాయతీ రెడ్డి వారి లే అవుట్‌లో హౌసింగ్ లబ్ధిదారులకు వెలుగు ద్వారా ఒక్కొక్కరికి రూ. 50వేలు చొప్పున ఇద్దరికి రుణాలను ఏపీఎం దేవసేన మంజూరు చేయడం జరిగింది. ఇటీవల జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కలికిరి ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఇంటి నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక స్తోమత లేక ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి వెలుగు ద్వారా రుణాలు మంజూరు చేయాలని వెలుగు ఏపీఎంను కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో భానుమూర్తిరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం దేవసేనలు హౌసింగ్ లబ్ధిదారులకు రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.

## తుఫానుల కారణంగా రైతులకు సూచనలు



కలికిరి, డిసెంబరు 3, ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లాలో కురిసిన తుపాను వర్షాలకు అక్కడక్కడ పండిన వరి పడిపోయింది. ఇలాంటి పొలాలు మనుషులతో కోత కోయిస్తే బాగుంటుందని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.కె.మంజుల, ఇతర శాస్త్రవేత్తలు తెలిపారు. వివిధ మండలాలలో రబీ వేరుశనగ విత్తుకోవడానికి ఈ వర్షాలు అనుకూలమని తెలిపారు. టమోటా, మిరప, బొప్పాయి, ఉల్లి తదితర పంటల్లో అక్కడక్కడ నీరు నిలవడం గమనించామని ఈ నీటిని వీలైనంత త్వంగా పొలాల్లో నుంచి తీసివేయాలని సూచించారు. డ్రిప్ ద్వారా జీవశిలీంద్ర నాశినులైన ట్రైకోడెర్మా, సుడోమోనాస్ మందులను ఎకరానికి ఒక లీటరు చొప్పున ఈ పంటలకు అందించాలని తద్వారా వేరుకుళ్లు తెగులు ఆకు ఎండు తెగులు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని తెలిపారు. బాగా చివికిన పశువుల ఎరువును రబీ వేరుశనగలో అంతర కృషి సమయంలో ట్రైకోడెర్మాతో పాటు వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. టమోటాలో బ్యాక్టీరియా మచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే నివారణగా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు మరియు 0.2 గ్రాములు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసి నివారించవచ్చునని తెలియజేశారు.

## చెవిటిమూగ సంఘం ఆధ్వర్యంలో 15న ర్యాలీ

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



కమీషనర్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

మదనపల్లె డివిజన్ చెవిటి మూగ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న మున్సిపల్ కార్యాలయం నుండి టౌన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆసంఘం గౌరవ అధ్యక్షులు జి.క్రిష్ణమూర్తి, తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమీషనర్ ప్రమీళకు టౌన్‌హాలులో జరిగే సమావేశానికి రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు. చెవిటి, మూగ సమస్యల పరిష్కారం కోసం ఐక్యతగా నిరంతరం పోరాడుతున్నామని ఆయన గుర్తు చేశారు.

## వనాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతాం

### సబ్‌ఫారెస్టు అధికారి శ్రీనివాసులు

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె బసినికొండలో రూ.రెండుకోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నగర వనాన్ని పట్టణ ప్రజలకు ఆరోగ్యన్నిచ్చే ఆరోగ్యవరంగా తీర్చిదిద్దుతున్నట్లు జిల్లా సబ్‌ఫారెస్టు అధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో పట్టణ ప్రజల సౌకర్యార్థం నగర వనాన్ని ఆరోగ్యపరంగా అన్ని రకాల సౌకర్యాతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

## ఉల్లాస్ మండలస్థాయి శిక్షణా కార్యక్రమం

రామసముద్రం, డిసెంబర్ 3 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపిడిఓ భానుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు సిసిలు, విఓఎలకు అవగాహన కల్పించారు. మండలంలో 42కేంద్రాచే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నవారు చదువు నేర్వాన్న ఆసక్తి ఉన్నవారు కూడా ఉల్లాస్ యాప్‌చే ఎవరైనా నమోదు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ భానుప్రసాద్, పంచాయితీ అధికారి గౌస్ బాషా, సిసి గంగాధర్, ఎంఈఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూళనపై ర్యాలీ

రామసముద్రం, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామసముద్రం మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయితీ మంగళవారం సిసి శ్రీనివాస ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూళనపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిసి శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరిత్యా నేరమని, చిన్న వయసులో పెళ్ళిచేయడం వల్ల బాఇకల విద్య ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఓఏ సరస్వతి, శివశంకర్‌నాయుడు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తవళంలో పొలం పిలుస్తోంది..రా

నిమ్మనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



ప్రసంగిస్తున్న శివకుమార్

నిమ్మనపల్లె మండలం తవళం పంచాయితీ కేంద్రంలోని ఆర్‌బికే కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది రా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ మాట్లాడుతూ రబీ-2024 సాగుచేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మురళీ మోహన్ మాట్లాడుతూ ఫెంగల్ తుఫాన్‌తో నష్టపోయిన వరిపంటలను పరిశీలించామన్నారు. ఏఈఓ ప్రసన్న మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్‌ల్లో ఎప్పటికప్పుడు సాగు వివరాలను ప్రభుత్వానికి తెలుపుతున్నామని, ఆర్‌బికే కేంద్రం ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలు, ఎరువులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సోమశేఖర్, శ్రీనివాసులు, గ్రామరైతులు పాల్గొన్నారు.

## వయోజనుల్లో అక్షరాస్యత కోసం అవగాహన కల్పించాలి

నిమ్మనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త:



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని వయోజనులను అక్షరాస్యులుగా మార్పు చేసేందకే ఉలా శిక్షణా శిబిరం ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఒక్కరోజు శిక్షణా శిబిరంలో ఏపిఎం మురళీ మాట్లాడుతూ డిజిటల్ లెటరసి. ఫైనాన్సియల్ తదితర చట్టాల గురించి వివరించారు. మండలంలో 32 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఒకొక్క సెంటర్లలో పదిమందిని అక్షరాస్యులుగా మార్చాలని ఏపిఓ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి చలపతిరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, సిసిలు ఈశ్వర్‌రెడ్డి, శాంతమ్మ, శారద, అంగన్‌వాడీ సిబ్బంది, విఓ లీడర్లు పాల్గొన్నారు.

## వర్షాలకు నేలకొరిగిన వరిపంట

ములకలచెరువు, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



మండలంలో పడిన వర్షాలకు వరిపంటలు నేలమట్టం అయ్యాయి. భారీ వర్షానికి వరి, దోస, కర్బూజ, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పంటలు సాగుచేసిన రైతులు పూర్తిగా నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఉంది. పంటల్లో నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారు చెబుతున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

## రైతు భరోసా కేంద్రంలో చోరీ

పుల్లంపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన పుల్లంపేటలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రంలో 70 వేల రూపాయలు విలువ చేసే కరెంటు వైర్లు, వివిధ రకాల విద్యుత్ పరికరాలు చోరీ అయినట్లు కాంట్రాక్టర్ మడగ్నల. శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రానికి రాష్ట్ర గత ప్రభుత్వం రూ.21.80 లక్షలు మంజూరు చేయగా శ్రీ తాను భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు .ఎన్నికల ముందే కొరముట్ల శ్రీనివాసులు స్థానిక నాయకులు ప్రారంభోత్సవం చేసిన అయితే ఇంకా 5 లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి బిల్లు బాకీ ఉన్నదని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తలుపులకు వేసి, ఉన్న తాళాలు అలాగే ఉన్నాయని తలుపులు లోపలికి వంగి ఉండడంతో డౌటు వచ్చి చూడగా కరెంటు వైర్లు, విద్యుత్ పరికరాలు మొత్తం చోరీకి గురైనట్లు గమనించడం జరిగింది అన్నారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులకు, పంచాయతీరాజ్ శాఖ సంబంధిత అధికారులకు తెలపడం జరిగిందన్నారు అయితే వారు అందుబాటులో లేమని బుధవారం వచ్చే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారని కాంట్రాక్టర్ మండలం శ్రీనివాసులు వివరించారు.

## ప్రతి డ్వాక్రా మహిళా లక్షాధికారి కావాలని ప్రభుత్వ లక్ష్యం

నిమ్మనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



ప్రతిజ్ఞ చేయిస్తున్న మహిళలు

ప్రతి డ్వాక్రా మహిళా లక్షాధికారి కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కళలను మనమందరం ఐక్యమత్యంతో ఉండి ఐకెపి సభ్యులు ఎల్లవేలలా గ్రామీణ మహిళలకు అన్ని రకాల అందుబాటులో ఉండి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సిసి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తవళం గ్రామ సమాఖ్య, విఓల సమావేశం చౌకిళ్ళవారిపల్లెలో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. డ్వాక్రా సంఘాల గురించి, వాటి పురోగతిపై గ్రూపుసభ్యులు, లీడర్లు ఏ విధంగా గ్రూపును జరుపుకోవాలని డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాల గురించి స్థానిక సంఘమిత్ర రెడ్డికుమారి సభ్యులకు వివరించారు. బ్యాంకు రుణాలు, శ్రీనిధి, పొదుపుసంఘాల అప్పుల గురించి తీసుకొన్న రుణాలు సరైన సమయంలో ఏవిధంగా జమ చేయాని కూడా వివరించారు. తీసుకొన్న రుణాలు సక్రమంగా చెల్లిస్తే ప్రభుత్వం అందిస్తున్న రాయితీల గురించి తెలిపారు. సక్రమంగా తీసుకొన్న రుణాలు చెల్లించకపోతే ఆ గ్రూపు అన్ని విధాల వెనుకబడి ఉంటుందని సమావేశంలో ఆమె వివరించారు. మొట్టమొదటిగా విఓ సమావేశంలో సిసి బాల్యవివాహాలు జరపరాదని, డ్వాక్రా మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు.

## సిటిఎంలో పొలం పిలుస్తొంది కార్యక్రమం

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



కళ్ళుఉప్పు చల్లుతున్న దృశ్యం

మదనపల్లె రూరల్ మండలంలోని సిటిఎంలో మంగళవారం పొలం పిలుస్తొంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళవారం సిటిఎం గ్రామంలోని రేగడ గొల్లపల్లె, రేగంటివారిపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో వర్షానికి నేలకొరిగిన వరిపంటలను పరిశీలించారు. అటువంటి పొలాల్లో కల్లుప్పు ఎకరాకు 15-20కిలోల చొప్పున చల్లినట్లైయితే విత్తనం మొలకెత్తదని తెలిపారు. వర్షానికి దెబ్బతిన్న పొలాల్లో రైతులు కల్లుప్పును చల్లుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సిబ్బంది సుబ్రమణ్యం, నాగేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు, వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.

## గృహ లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయండి



బద్వేలు, డిసెంబర్ (ప్రభాతవార్త);
గృహ లబ్ధిదారులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజారత్నం కు సూచించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన హౌసింగ్ డైరెక్టర్ ఆమెకు పిఎంఎవై 2 గురించి వివరించారు. ఇందులో భాగంగా ఆమె వారికి సలహాలు, సూచనలు ఇస్తూ నియోజకవర్గం లోని చాలా గ్రామాలలో 2014 నుండి బిల్లులు పెండింగ్ ఉన్నాయని వాటిని కూడా మంజూరు చేయించాలన్నారు. అలాగే పిఎంఎవై 1.0 కింద మంజూరు అయిన ఇల్లు త్వరగా పూర్తి అయ్యేలా చూడటంతో పాటు పిఎంఎవై2.0 కింద అర్హులందరికీ ఇల్లు మంజూరు చేయాలని, అదే విధంగా అన్నీ లేఔట్ లలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన హౌసింగ్ డైరెక్టర్ అర్హులందరికీ ఇల్లు మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. అనంతరం పురపాలక కార్యాలయం నందు మునిసిపల్ కమీషనర్, హౌసింగ్ , మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.అలాగే గతంలో గృహాలు మంజూరు అయిన వారు కూడా సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తి కాకపోతే బిల్లులు చెల్లించలేమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## ఖాదర్ బాదర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తగినంత ఉపాధ్యాయులను నియమించాలి

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :
మండలంలోని ఖాదర్ బాద్ ఉర్దూ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా విద్యాశాఖ అధికారులు సావిత్రమ్మ, శోభారాణిలకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఖాదర్ బాద్ ఉర్దూ పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారని ఒకటి నుండి 8వ తరగతి వరకు చదువుతున్నారని గతంలో పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారని వీరిలో ఒకరు జూన్ నెలలో రిటైర్ అయ్యారని ప్రస్తుతం ఇప్పుడు ఒకరిని డిప్యూటేషన్ మీద నియమించారని 90 మంది విద్యార్థులకు బోధించడానికి కనీసం ఐదు మంది ఉపాధ్యాయులు అవసరం అయితే ఉపాధ్యాయులు తక్కువ ఉండటం వల్ల పిల్లలకు సరైన విద్య అందించలేక పోతున్నారన్నారు. దీనితో పిల్లల చదువులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఉర్దూ భాషకు తోడ్పాటు అందించి తక్షణమే పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి సరియైన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, ముక్తియార్ పాల్గొన్నారు.



## శోభాయాత్రను జయప్రదం చేయండి

పీలేరు డిసెంబర్ 03 ప్రభాతవార్త ః
డిసెంబర్ 11వ తేదీ తిరుపతి బి టి ఆర్ కాలనీ వద్ద ఉన్న అన్నమయ్య కళాక్షేత్రం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం వరకు కొనసాగే శోభాయాత్ర కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆ ఉత్సవ ఆహ్వానితులు శ్రీ విజయ శంకర స్వామి పీలేరు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## అండర్ బ్రిడ్జి పనులు రద్దు చేసిన రైళ్లను ఆపాలని డిఆర్‌యంకు వినతి పత్రం అందజేసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి

రాజంపేట,డిసెంబర్ 03 ,ప్రభాత వార్త :



అన్నమయ్య జిల్లాలోనే జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరలలో పూర్తి చేసి రాజంపేటలో రద్దు చేసిన రైళ్ల నిలుపుదలను తిరిగి పునరుద్దించాలని కోరుతూ గుంతకల్ రైల్వే డిఆర్‌యం విజయ్‌కుమార్‌కు మంగళవారం గుంతకల్ డిఆర్ యు సిసి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం గుంతకల్‌లోని డిఆర్‌మంను మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం సమస్యల వినతి పత్రాన్ని ఆయనకు అందజేసి వివరించారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో రాజంపేట, రైల్వే కోడూరు, రామాయపాలెం వద్ద, ఓబులవారిపల్లె, రెడ్డిపల్లె, అనంత రాజంపేట ఎల్‌సి గుట్లు వద్ద అండర్ బ్రిడ్జి పనులు త్వరలో పూర్తి కాకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు వాటిలో నీళ్లు నిలిచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కాంట్రాక్టర్‌లకు ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. కొన్ని చోట్ల అత్యంత దారుణంగా నాసిరకంగా పనులు జరుగుతున్నాయన్నారు. రాజంపేటలో ఎప్పటి నుంచో నిలుస్తున్న రైళ్ల నిలుపుదలను రద్దు చేశారన్నారు. తిరితీ వీటిని నిలపాలని కోరారు. కుక్కల దొడ్డి గ్రామంలో రైల్వే ట్రాక్ వద్ద గిరిజనుల భూములకు కరెంట్ తీసుకునేందుకు అనుమతినివ్వాలని కోరారు. వీరితో పాటు కుక్కలదొడ్డి సర్పంచ్ పూర్ణమ్మ, రమణయ్య, మహేష్, తదితరులు ఉన్నారు.

## స్కిల్ హాబ్‌సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ

### జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :
జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు స్కిల్ హాబ్‌సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ ద్వారా అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఏడు స్కిల్ హాబ్‌సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చదువుకొని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఈ స్కిల్ సెంటర్ల ద్వారా శిక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. డిమాండ్ దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపయోగపడే కోర్సుల్లో మూడు నెలలు పాటు శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో ఉపాధి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా తరగతులు ఈనెల 5నుంచి ప్రారంభం అవుతాయన్నారు. వివరాలకు 9603770097, 9550104260 ఫోన్‌నెంబర్లను సంప్రదించాన్నారు.

## సమిష్టి కృషి వలనే బిజెపి లక్ష సభ్యత్వాలు నమోదు

### జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

సమిష్టి కృషి వల్లనే జిల్లాలో బిజెపి లక్ష సభ్యత్వ నమోదాలు చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బిజెపి కార్యాలయంలో రాజంపేట పార్లమెంటరీ బిజెపి జిల్లా అధ్యక్షులు అధ్యక్షతన జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదులో పాల్గొని లక్ష్యం మేరకు చేయడం అభినందనీయమన్నారు. ఆన్‌లైన్ సభ్యత్వ నమోదాలు, ఆఫ్‌లైన్ సభ్యత్వాలు అత్యంత పారదర్శకంగా జరగడం పట్ల రాష్ట్ర పార్టీ ప్రసంశలు ఇవ్వడం జరిగిందన్నారు. సంస్థాగత నిర్మాణ ప్రక్రియ త్వరలోనే చివరిదశకు చేరుకొందని తెలిపారు. బూత్‌కమిటీలు, మండల కమిటీల ఏర్పాటు ఈనెలాఖరులోగా పూర్తి కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి చేపదుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, సహాయ అధికారి పులి నరేంద్రకుమార్‌రెడ్డి, గోరంట్ల రమేష్, గోపాల్‌రెడ్డి, ఆకుల క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## యాచకులకు బివైఎస్‌చే దుప్పట్లు పంపిణి

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పట్టణంలోని పలుచోట్ల ఉన్న యాచకులకు, నిస్సాహయకులకు బివైఎస్ అధ్యక్షులు పునిత్ మంగళవారం ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. పునిత్ కుమార్తె గాణవి పుట్టినరోజు సందర్భంగా యాచకులకు చలితీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదే విధంగా బ్రెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బివైఎస్ నాయకులు శ్రీనివాసులు, ఆది, శశికుమార్, నాగార్జున, నితీస్, నందీష్, దేవేష్, ద్వారక పాల్గొన్నారు.

## అవినీతిని ప్రశ్నించే హక్కు వైకాపాకు లేదు

మదనపల్లె, డిసెంబర్ 3 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న నాయకులు

అవినీతిని ప్రశ్నించే హక్కు వైకాపా నాయకులకు లేదంటూ టౌన్ బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, టిడిపి అధికార ప్రతినిధి అధికారి ఆర్‌జె.వెంకటేష్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు సుధాకర్‌లు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రాష్ట్రం అవినీతిలో కూరుకుపోయి అభివృద్ధిలో 30ఏళ్ళు వెనక్కి పోయిందన్నారు. తహాశీల్దార్ అవినీతిపై వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అయితే తహాశీల్దార్ అవినీతికి వత్తాసు పలుకుతూ వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. అవినీతి అధికారులకు కొమ్ముకాస్తు భయటకు రాని వైసిపి నాయకులు ప్రెస్‌మీట్‌లకు బయటకు వచ్చి మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని జీర్ణించుకోలేక వైకాపా నాయకులు విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఘం శ్రీనివాసులు, రాటకొండ మధుబాబు, టౌన్‌బ్యాంకు వైస్ ఛైర్మెన్ మహర్షి, జేసిబి మధు, షంషీర్, నాగూర్‌వల్లి, గిరీష్, ఉప సర్పంచ్ భారతి, నవీన్‌చౌదరి, శశికుమార్ పాల్గొన్నారు.


### e-procurement tender notice

Rajampet Municipality

| S.No | 'e'-procurement Notice No. | Number of Works | Estimate Contract Value (In Lakhs) |
|---|---|---|---|
| | 58/GF/DEE/AE/2024-25 to 60/GF/DEE/AE/2024-25 | 3 | 9.39 |
| | 61/15th FC/DEE/AE/2024-25 to 63/15th FC/DEE/AE/2024-25 | 3 | 36.34 |
| | Bid document download start date | 04-12-2024, 10.00 AM | |
| | Bid document download end date | 18-12-2024, 3.00 PM | |
| | Last dateof receipt of Tender | 18-12-2024, 3.30 PM | |

Further datails can be seen @ 'e' - procurement Market Place in https://tender.apeprocurement.gov.in/, Contract No.9989051971

Commissioner
Rajampet Municipality

## అర్హులైన పేదలకు నివాస స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదు



లక్కిరెడ్డిపల్లి, డిసెంబర్ 03 ప్రభాతవార్త

మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట అర్హులైన పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి పనులు నిమిత్తం పట్టణాల్లో నివసిస్తున్న చాలామంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత నివాసం లేక మానసికంగా ఆవేదన చెందుతున్నారని నాటి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి నివాస స్థల పట్టాలు ఇచ్చామని గొప్పలు తప్ప ఆచరణలో సాధ్యం కాలేదు అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలు చూపించి వెంటనే ఐదు లక్షల రూపాయలు రుణం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈ దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలన చేయాలని వార్డు సచివాలయాల్లో పరిష్కారం కాకుంటే కలెక్టరేట్ దగ్గర వందలాది మంది పెద్ద ఎత్తున ధర్నాకు సిద్ధమవుతామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర, ప్రమీల, సిపిఐ నాయకులు కే.ఓబులేష్ , గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## వయోజన విద్య వాలంటీర్ బాధ్యతలు మాకొద్దు

లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 03 ప్రభాత వార్త



వయోజన విద్య వాలంటరీలగా బాధ్యతలు మాకొద్దని అంగన్వాడి కార్యకర్తలు మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పద్మావతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు రోజువారి కార్యక్రమాలు అంగన్వాడి రిజిస్టర్లు వ్రాయడం ప్రీస్కూల్ కార్యక్రమాలు, పౌష్టిక ఆహారం పంపిణీ, యాప్ లలో డేటా నింపడం ఇటువంటి వాటితో అధిక పని భారంతో ఒత్తిడితో సతమతమవుతుంటే అధికారులు వయోజన విద్య వాలంటీర్లుగా పనిచేయాలని చెప్తున్నారని , ఆ బాధ్యత నుంచి మాకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, ప్రభావతి, రుక్మిణి, శ్రీదేవి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం

మైదుకూరు,డిసెంబర్ 03, ప్రభాతవార్త:



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో కృష్ణాపురం గ్రామ పొలంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖ వారు మంగళవారం పాల్గొనడం జరిగింది. వ్యవసాయ శాఖ నుండి రబీ సీజన్లో వేసిన పంటలకు ఈ పంట ద్వారా నమోదు చేసుకోవాలి మరియు జొన్న మినుము మొక్కజొన్న పంటలకు ఫసల్ భీమా ద్వారా ప్రీమియం డిసెంబర్ 15వ తేదీ లోపల చెల్లించాలి అని తెలియజేయడమైనది. ఉద్యాన శాఖ ద్వారా రైతులు మల్చింగ్ షీట్లు,డ్రిప్పు స్ప్రింగ్ ర్లకు, అప్లై చేసుకోవాల్సిందిగా రైతులకు అవగాహన కల్పించారు అనంతరం కొండారెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు గురించి రైతులకు అవగాహన మరియు ఆయిల్ పామ సాగు తర్వాత పంటను కంపెనీ వారు మాత్రమే కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లిస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పసల. లక్ష్మీప్రసన్న, ఆయిల్ పామ్ అధికారి కొండారెడ్డి, దేవి ప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రామాపురం: డిసెంబర్ 03, ప్రభాతవార్త



మండల పరిధిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందని టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామాపురం మండలం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నీటి సమస్య మరియు ల్యాబ్ లో పరికరాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులకు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం మీపై ఉందన్నారు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడ నిర్వాహకులకు సూచించారు.

## ప్రతి పాఠశాల యందు పేరెంట్ టీచర్ కమిటీ సమావేశం జరుపుకోవాలి

చెన్నూరు :డిసెంబర్3: (ప్రభాతవార్త)

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి పాఠశాల యందు పేరెంట్ టీచర్ కమిటీ సమావేశం జరుపుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సునీత అన్నారు. చెన్నూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆయా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ,ఉపాధ్యాయులతో మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని నిర్వహించారు .ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి బి. కిరణ్ కుమార్ రావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి పాఠశాల యందు ఈనెల 7వ తేదీ శనివారం ఆయా పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించాలని సూచించారు .ముఖ్యంగా ఉన్నత పాఠశాలకు మండలాధికారులను పరిశీలకులుగా నియమించడం జరిగింది. ఆ పరిశీలకులు పాఠశాలలను సందర్శించడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశమునకు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను తప్పనిసరిగా హాజరైనట్లు చూసుకోవాలని చెప్పారు. ఈ సమావేశమునకు సంబంధించిన ప్రణాళిక తయారు చేసుకోవాలని ,కమిటీలు నిర్వహించుకోవాలని, పాఠశాలలను ఆహ్లాదకరంగా ఉంచుకునేందుకు అందరూ ఉపాధ్యాయులు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్పీలు బి .వెంకటసుబ్బయ్య ,పి .శ్రీనివాసులు సమావేశం విధి విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో మండలములోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## రైతులు సాగు చేసిన పంటల సమాచారాన్ని నమోదు చేసుకోవాలి

మైదుకూరు, డిసెంబర్ 03, ప్రభాతవార్త:



రబీలో రైతులు సాగుచేసిన పంటల సమాచారాన్ని ఈ పంట ద్వారా నమోదు చేసుకోవాలని పట్టాదారు పాస్ పుస్తకము ఆధార్ కార్డుతో మీ యొక్క రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను అలాగే మరిన్ని వివరాల కొరకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని రబీ సీజన్లో వేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కార్యక్రమం ద్వారా రైతులు ఏ ఏ పంటకు ఎంత ప్రీమియం ఎకరాకు చెల్లించాల్సిన రూపాయలు ,బుడ్డ సెనగ 480,మినుము 285,పెసర 270,నువ్వులు 180,వేరుశెనగ 480,జొన్న 315, ప్రొద్దుతిరుగుడు 300, వరి 630, డిసెంబర్ 15వ తేదీ లోపల ప్రీమియం చెల్లించి వరి పంటకు డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా ఇన్సూరెన్స్ కొరకు కామన్ సర్వీస్ సెంటర్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రైతులకు మైదుకూరు మండల వ్యవసాయ అధికారి పసల.ప్రసన్న, తెలియజేశారు.

## నీలకంఠరావుపేట గ్రామానికి నీటి పరిష్కారానికి కృషి

రామాపురం: డిసెంబర్ 03, ప్రభాతవార్త



మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీ గాండ్లపల్లిలో మంగళవారం రాష్ట్ర రవాణా, క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు బోరు బావి మంజూరు చేసి తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి అన్నారు. తాగునీటి బోరుకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోర్డులో నీరు పుష్కలంగా పడడంతో ప్రజలు ఆనందిస్తున్నారన్నారు. సీకే రోడ్డు నుంచి నీలకంఠరావుపేట వరకు తా రోడ్డు మంజూరు అయిందని త్వరలో రోడ్డు మరమ్మతులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నీలకంటరావుపేట వైస్ సర్పంచ్ సయ్యద్ మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు నీయజ్, బాషా వలి, సయ్యద్ పీర్, పెంచలరెడ్డీ, రమణ, అబ్దుల్ సలాం, శివ, దేవ తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల తోటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి



రామాపురం : డిసెంబర్ 03 , ప్రభాతవార్త

పండ్ల తోటలు మామిడి తోటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని రామాపురం వ్యవసాయ అధికారిని యై నాగమణి పేర్కొన్నారు మంగళవారం కర్ణపు వాండ్ల పల్స్లి, సరస్వతి పల్లి గ్రామం లో పొలం పిలుస్తోంది కార్యక్రమము నిర్వహించినట్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతము రబీ సీజనులో సాగుచేసిన పంటలకు ఈ పంట నందు నమోదు చేసుకోవాలని తెలిపారు ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు వరి పొలంలో నీరు నిల్వ లేకుండా కాలువలు తయారు చేయాలని సూచించారు ఉప్పు ద్రావణాన్ని వరికంకులపైన పిచికారి చేసుకున్నట్లయితే గింజలు మొలకరావడాని అరికట్టవచ్చని ఆమె తెలిపారు మామిడిలో పూత త్వరగా మరియు ఒకేసారి రావడానికి మరియు ఆడపూల శాతం త్వరగా పెరగడానికి 13045 (మళ్ళక) 10 గ్రాములు వాటరు నీటికి మరియు మ్యాంగోస్పెషల్ 5 గ్రాములు వాటరు నీటికి లేదా ఫార్ములా 14 5 గ్రాములు వాటరు నీటిని కలిపి పిచికారి చేయాలని తెలిపారు. టమోటాకు పంట భీమా ఎకరాకు రు 1600 చెల్లించినట్లయితే రు 32,000 రూ పంట భీమా వర్తిస్తుందని, అన్నారు. డిసెంబర్ 15 వ తేది రైతు సేవా కేంద్రం నందు సంప్రదించాలని ఆమె తెలిపారు.

## డీసీసీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 03, ప్రభాతవార్త



డిసిసి బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు డీసీసీ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించనున్నట్లు ఏపీ కో ఆపరేటివ్ సెం ట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేట్ కార్య నిర్వాహక అధ్యక్షుడు గంటా నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం డీసీసీ బ్యాంకులో మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు అంది స్తున్న సేవలతోపాటు డిపాజిట్ల సేకరణ కార్యక్రమాన్ని కూడా తలపెట్టడం జరిగిందన్నారు. డీసీసీ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించి సీనియర్ సిటర్యాలీ నిర్వహించిన ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు డీజన్లకు 666 రోజులకు 8.35 శాతం వడ్డీ ఇస్తుందని, సాధారణ ప్రజలకు 7.85 శాతం ఇస్తుందని తెలిపారు. బంగారు ఆభరణాలు, స్థిరాస్తి తాకట్టుపై, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు, చిరు వ్యాపారులకు వర్కింగ్ కాపిటల్, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉన్నత చదువులకు విద్యా రుణాలను కూడా అందిస్తుందన్నారు. 15 సంవత్సరాలలోపు పిల్లలకు పొదుపు, రికరింగ్ ఫిక్స్డ్ డిపాజిట్ ఖాతాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ వెంకటసుబ్బయ్య, రమణయ్య, హేమ సురేష్ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## వయోజన విద్యా భారం మోపడం సరికాదు

వాల్మీకిపురం, డిసెంబర్ 03 ప్రభాతవార్త: :



అంగన్వాడీలపై వయోజన విద్యా భారం మోపడం సరికాదని అంగన్వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేసి, వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తమపై వయోజన విద్య భారాన్ని మోపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే ఆన్లైన్ పనులు ఎక్కువ అయ్యాయని, ఇలాంటి సమయంలో వయోజన విద్య భారాన్ని మోపడం తగదన్నారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలకు పూర్తి న్యాయం చేయలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు చంద్రావతి, భూకైలేశ్వరి, దేవసేన, బుజ్జమ్మ, గులాబ్జాన్, గాయత్రి, సంపూర్ణ, నజీమున్నిసా, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పింఛా నది రోడ్డులో రాకపోకలు నిలుపుదల

పీలేరు డిసెంబర్ 03 ప్రభాతవార్త ః



పీలేరు మండలం, బాలంవారిపల్లి పంచాయతీ, నూనేవాండ్లపల్లి ఒంటేరు వాండ్లపల్లి మార్గంలోని పింఛా నది రోడ్డుపై వాహనాలు, పాదచారుల రాకపోకలను తాత్కాలికంగా నిషేధించినట్లు పీలేరు మండల తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గార్గేయనది (పింఛానది) ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటితో నది ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో ఈ మార్గంలో రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రజా రక్షణా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నామని అన్నారు. మంగళవారం స్థానికులను హెచ్చరిస్తూ నదిలోని రోడ్డును ఎవరూ దాటడానికి వీలు లేకుండా నది ఒడ్డుకు ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా, రాకపోకలను నిషేధిస్తూ కంచెను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బాలకృష్ణ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యం : యల్లటూరు

వైసిపి మండల కన్వినర్తో పాటు 300 కుటుంభాలు చేరిక



రాజంపేట,డిసెంబర్ 03,ప్రభాత వార్త :

రాజంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యంగా పెట్టుకున్నానని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ కర్త యల్లటూరు శ్రీనివాస రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నందలూరు మండలం లేబాక గ్రామంలో నందలూరు మండల వైయస్ ఆర్ సిపి మండల కన్వినర్ అన్నం.నాగేంద్ర మూర్తి తో పాటు పలువురు నాయకులు ప్రస్తుత ఉప సర్పంచ్ వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ లింగాల పెంచలయ్యలతో పాటు సుమారు 300 కుటుంభాలు లేబాక, టివి పురం నుంచి జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ యల్లటూరు శ్రీనివాస రాజు జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైసిపి మండల కన్వినర్ అన్నం.నాగేంద్ర మూర్తి మాట్లాడుతూ శ్రీనివాస రాజు ఆద్వర్యంలో పార్టీలో చేరడం ఎంతో ఆసక్తిగా ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్దాంతాలు, ప్రతి నిత్యం ప్రజల కోసం కష్టపడే నాయకుడి బాటలో కలసి పని చేయాలనే తపన తోనే పార్టీకి ఆశక్తులై శ్రీనివాసరాజు ద్వారా 300 కుటుంబాలు జనసేన తీర్థం పుచ్చుకోవడం జరిగిందన్నారు. అనంతరం శ్రీనివాస రాజు మాట్లాడుతూ జనసేన పార్టీ విలువలు కలిగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పని తీరును చూసి నీతి, నిజాయితీ పోరాట పటిమను కల్గిన నాయకుడుగా గుర్తించిన వారందరూ పార్టీలో చేరేందుకు ఆశక్తి చూపుతున్నారన్నారు. ఇప్పటికే తన ఆద్వర్యంలో అనేక వేల మందిని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో వైసిపి నుంచి జనసేన పార్టీలోనికి చేర్చుకోవడం జరిగిందన్నారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ గడిచిన నాలుగైదు నెలల్లోనే కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ చేస్తున్న పనులను చూసి నాయకుల కంటే ముందు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలే జనసేన పార్టీ విలువలను గూర్చి చెబుతున్నారన్నారు. పార్టీ పట్ల ఆశక్తి కలిగి పార్టీ సిద్దాంతాలకు ఆశక్తులై పార్టీలో చేరేందుకు వారే పిలుస్తున్నారన్నారు. దీనికి నిదర్శనం నందలూరు వైసిపి మండల కన్వినర్ తనతో పాటు మరి కొంత మంది సీనియర్ నాయకులను 300కుటుంబాలను చేర్చడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలోనికి వచ్చిన 300 మందికి జనసేన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమమంలో అనేకమంది సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జండర్ ఆధారిత హింస చట్ట విరుద్ధం

వీరబల్లి, డిసెంబర్03, ప్రభాత వార్త:



జెండర్ ఆధారిత హింస చట్ట విరుద్ధమని ఈవోపీఆర్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వెలుగు సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ స దర్భంగా ఈ ఓ పీ ఆర్ డి రామ చంద్ర రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఆడా మగా సమానమని ,తేడా ఉండకూడదన్నారు. బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, అనంతరం బాల్యవివాహాలు అరికట్టాలని ర్యాలీ చేసి,ప్రతిజ్ఞ పూనడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏపియం ఖాదర్ వలి,అంగన్వాడీ సూపర్ వైజర్లు సరస్వతమ్మ,లలిత,సెక్రెటరీ వరప్రసాద్,ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది,మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆకేపాటి మద్దతు కోరిన విధ్యార్థి సంఘ నాయకులు

రాజంపేట,డిసెంబర్ 03 ,ప్రభాత వార్త :



విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం చేపట్టే అఖిల భారత విధ్యార్థి సంఘం నాయకుల పోరాటానికి మద్దతు ఇవ్వాలని అన్నమయ్య జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమర్నాథ రెడ్డిని విధ్యార్థి నాయకుల మద్దతు కోరారు. మంగళవారం ఏబీవీపీ నాయకులు ఎమ్మెల్యేని ఆకేపాటి ఎస్టేట్లో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మల్లికార్జున మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ విధ్యారంగంలో ఎటువంటి మార్పుల, సమస్యల పరిష్కారాలు కలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్న చందంగా విధ్యా రంగ సమస్యలు ఉన్నాయన్నారు. భవిష్యత్ తరానికి బాటలు వేసే విధ్యార్థుల పట్ల ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం విచారకరం అన్నారు. రాష్ట్ర విధ్యాశాఖ మంత్రి విధ్యాశాఖను వదలి ఇతర శాఖల పట్ల ఎక్కువగా చొరవ చూపుతున్నారన్నారు. విధ్యారంగం దీనస్థితిలో పడిపోయిందని ఈ సమస్యల పరిష్కారం కోసం విధ్యార్ధి నాయకులు తొందరలో చేపట్టే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డి ని కోరి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమమంలో పలువురు ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## అధనపు భారాన్ని తొలగించాలి : అంగన్వాడీ కార్యకర్తల ధర్నా

రాజంపేట,డిసెంబర్ 03 ,ప్రభాత వార్త :



ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలపై పెట్టిన అదనపు భారాన్ని తగ్గించి తక్షణమే రద్దు చేయాలని అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అసోషియేషన్ సిఐటియు ఆద్వర్యంలో రాజంపేట ఐసిడీయస్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. కార్యకర్తలపై ప్రభుత్వం అదనపు బాధ్యతలు పెట్టి పనిభారం పెంచుతోందన్నారు. దీనిని తక్షణమే రద్దు చేసి అంగన్వాడీ కార్యకర్తలకు అధనంగా పెట్టిన వయేజన విధ్య అదనపు భారాన్ని ఉప సంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సంబంధిత అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంమలో విజయమ్మ, అమరావతి, విజయ లక్ష్మీ, ఈశ్వరమ్మలతో పాటు రాజంపేట డివిజన్లోని పలు ప్రాంతాల అంగన్వాడీ కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేదాం

వాల్మీకిపురం, డిసెంబర్ 03 ప్రభాతవార్త:

ప్రతి గ్రామం నుంచి ప్రతి వైసిపి కార్యకర్త సైనికుడిలా పని చేసి, కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలను ప్రజలకు వివరించాలని పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపర్తిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ఆర్భాటంగా హామీలు ఇచ్చేసి, ఆరు నెలలు కావస్తున్నా హామీలను అమలు చేయకుండా విస్మరిస్తుండడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఏ కార్యకర్తకు కష్టమొచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకట్రమణ, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, ద్వారక, రవీంద్రా రెడ్డి, చెంగల్ రెడ్డి, సాంబ శివ, ప్రియరంజన్ రెడ్డి, మోహన్ రెడ్డి, నీళ్లభాస్కర్, సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## పొలం పిలుస్తోంది కార్యక్రమం

సుండుపల్లి, డిసెంబర్3,ప్రభాతవార్త:



మండలంలోని పెద్దినేని కాల్వ, మడితాడు, ఆర్.ఎస్.కె పరిధిలోని బెస్తపల్లి, గుట్టక్రిందరాచపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి మహబూబ్ బాషా మాట్లాడుతు ఈ రబి సీజన్ సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ కోసం ప్రతి ఒక్క రైతు సోదరులు కూడా ప్రీమియం అనేది చెల్లించకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ మహబూబ్ బాషా, ఉద్యానవన శాఖ అధికారి శ్రీమతి వనితా బాయి, ఏపీఎంఐపీ అధికారి వినోద్, ఆర్. ఎస్. కే సిబ్బంది ఓబులేసు, రామకృష్ణ, ఏ.పీ సీ.యన్ ఎఫ్ సిబ్బంది, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

## అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీడీవో కు వినతి

రాజంపేట అర్బన్ , డిసెంబర్3 ప్రభాతవార్త



రాజంపేట మండలంలో 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ గ్రామీణ అధ్యక్షుడు ధన్య సుబ్బ నరసయ్యనాయుడు ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి సుబ్బరాయుడు, చుండు సుధీర్, సింగన పరుశురాం, పసుపులేటి పెంచలయ్య, హరి, వల్లీ తదితరులు పాల్గొన్నారు.

## వయోజనులకు చదువు చెప్పడంపై శిక్షణ

చిన్నమండెం డిసెంబర్ 3 ప్రభాతావార్త :



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ వయోజన విద్యా కార్యక్రమం పైన అంగనవాడి టీచర్లు మరియు వెలుగు నుండి సీసీలు, వివోఏలు, అంగన్వాడి సూపర్వైజర్ల వారికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగినది. ఈ శిక్షణ యందు మన ఆచార్య వ్యవహారాలు, పరిశుభ్రత, ఆరోగ్యం, ఎన్నికలు, మన బాధ్యత, గణితం, ప్రభుత్వ చట్టాలు, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత పాటు మన సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను గురించి వివరించడం జరిగినది. వీటితో పాటుగా వాలంటీర్స్ వయోజనులకు ఏ విధంగా చదువు చెప్పాలి వాలంటీర్స్ బాధ్యతలు గురించి వివరించడం జరిగినది. మండలంలోని 38 వాలంటీర్స్ కేంద్రాలలో దాదాపుగా 380 మంది నిరక్షరాశులను గుర్తించడం జరిగినది. వీరికి మూడు నెలల పాటు రాత్రిపూట చదువు నేర్పించడం జరుగుతుంది. నేటి సమాజంలో జరుగుతున్న ఏటీఎం, బ్యాంకుల యందు, మనం ఉపయోగించుచున్న వస్తువుల వినియోగంలో యందు, మన సెల్ ఫోన్ నందు వచ్చు మెసేజ్ల వలన జరుగు మోసాల గురించి చర్చించడం జరిగింది.

## ఉల్లాస్ యోజన ద్వారా నిరక్షరాస్యత తగ్గించాలి

వీరబల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త:



మండలంలోని నిరక్ష రాక్షసులను లేకుండా చేయడమే ఉల్లాస్ యువజన ముఖ్య ఉద్దేశమని పిఒపిఆర్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 500 మంది స్వయం సహాయక సంఘ సభ్యులను గుర్తించి వారికి వలంటరీ టీచర్లతో అక్షర జ్ఞానం నేర్పించడం జరుగుతుందన్నారు.అంగన్వాడీ టీచర్ పరిధిలో 10 మంది అభ్యాసకులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో నిరక్షరాశులు ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపియం ఖాదర్ వలి, వయోజన విద్యా సూపర్ వైజర్ మాధవిలత, అంగన్వాడీ సూపర్ వైజర్లు సరస్వతమ్మ, లలితమ్మ,వాలంటరీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ బలోపేతం

కడప డిసెంబర్ 3, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ బి 445 బి ఎం ఎస్ సర్వసభ్య సమావేశంలో చౌటపల్లి రామ్గోపాల్ రెడ్డి రాష్ట్ర నాయకులు వారి ఆధ్వర్యంలో పలు అనుబంధ సంస్థలు నుండి ఈరోజు సుమారు 70 మంది యూనియన్ సభ్యులుగా చేరడమైనది జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ జయప్ప, మరియు సీనియర్ నాయకులు వాసుదేవుడు, సివిఆర్ ప్రసాద్ రెడ్డి, పుల్లయ్య తదితరు యూనియన్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొని సంఘంలో చేరే వారికి కండువాలు వేసి యూనియన్లోకి ఆహ్వానించడం అయినది వారు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ ఐదు జిల్లాలకు బిఎంఎస్ అనుబంధ సంస్థ యూనియన్ నాయకులు ఆంధ్ర రాష్ట్ర పవర్ యూనియన్ బలోపేతం చేస్తామని మీ అందరి సహకారంతో పలు సమస్యలు ఏవి ఉన్నను అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతామని తెలియజేశారు.

## చిత్రలేఖనం పోటీలు

ఒంటిమిట్ట డిసెంబర్3 ప్రభాతవార్త:



మండలంలోని కొత్తమాదవరం ఉన్నత పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ ం సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖనం , సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలు ప్రత్యేకవిద్య పాఠశాల సహాయకురాలు సుగుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి ల ఆద్వ ర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు నిరుత్సాహ పడోద్దు

ఒంటిమిట్ట డిసెంబర్3 ప్రభాతవార్త:



ప్రస్తుత కాలంలో దివ్యాంగులమని నిరుత్సాహ పడవద్దని వికలత్వం అనేది శరీరానికి తప్ప మనసుకు ఆలోచనకు కాదని నిరూపించాలని ఉపాధ్యాయుడు హరినాద్రెడ్డి తెలిపారు. మండలానికి చెందిన హరినాద్రెడ్డి కొత్తపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నరు. మంగళవారం కొత్తపల్లి పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నరు. ఈ సందర్భంగా విద్యార్దులకు తిది బోజనం ను ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదివ్యాంగులువారి ఆవయవలో పాలను లోపాలుగా బావించి అధైర్య పడాల్సినా ఆవసరం లేదని తెలిపారు. సాదించాలనాన తపన ఉంటే వికలత్వం అడ్డు రాదని సూచించారు. ఆందుకు ఉదాహరణగా ఆనేకమైన మేదావులు రచయితలు కవులు కళాకారులు సింగర్స్ లు వున్నారన్నారు. వారిలో లూయిబ్రెయిలీ హెలెన్కెల్లర్, నిక్యుని ఇచ్, సంజీవరాజ్శర్మ, లక్కోజి తదితరులు ఉన్నారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వాల్మీకిపురం, డిసెంబర్ 03 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని టీఎం వ్యాలీ వద్ద మంగళవారం చోటు చేసుకొంది. వివరాలు.. కలికిరి పట్టణంలోని మెయిన్బజార్కు చెందిన అబ్దుల్ రహిమాన్ కుమారుడు బాపనపల్లి అష్రఫ్ (27) మంగళవారం ఉదయం మదనపల్లి వైపు నుంచి స్వగ్రామమైన కలికిరికి కారులో బయల్దేరాడు. మార్గమధ్యంలో మండలంలోని చింతలవారిపల్లి పంచాయతీ టిఎం వ్యాలీ వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు అష్రఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాదన వినకుండా ఉద్యోగ తొలగింపు కూడదు

(కాంట్రాక్టు ఉద్యోగి అయినా సరే-ఎ.పి. హైకోర్టు స్పష్టీకరణ)

**బద్వేలు లీగల్, డిశంబరు 03 ప్రభాతవార్త :**

ఆరోపణలపై ఎవరైనా ఒక వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నపుడు అతను కాంట్రాక్టు ఉద్యోగి అయినప్పటికీ తన వాదనను వినకుండా ఉద్యోగం నుండి తొలగించడం కూడదని ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం ఓ కేసులో తీ ర్పునిస్తూ స్పష్టం చేసింది. తన సేవలను ఉపసంహరించి కాంట్రాక్టును రద్దు పరుస్తూ జారీ అయిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఒక కాంట్రాక్టు ఉద్యోగి దాఖలు చేసిన వ్యాజ్యము పై విచారణ అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది. ఓ వ్యాజ్యములో పిటీషనర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కెజిబి)లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచరుగా 2011వ సంవత్సరంలో ఎంపికైన తరువాత ఆ పిటీషనరు ఉద్యోగం కాంట్రాక్టును ప్రతి సంవత్సరం పొడిగిస్తూ మినిమం టైం స్కేల్ క్రింద వేతనాల క్రమబద్ధీకరణ కోసం అపసవ్య మార్గంలో ఇతరులకు ఇవ్వడానికి డిమాండ్ చేస్తూ వాట్సప్ ద్వారా వివిధ కేజీబీలలోని సిబ్బందికి సందేశాలు బట్వాడా చేశా రన్న ఆరోపణలు రావడంతో ఏలాంటి విచారణ లేకుండానే పిటీషనర్‌ను ఉద్యోగం నుండి తొలగించడమేగాక కాంట్రాక్టును కూడా రద్దు చేశారు. తగు నివృత్తికై కోర్టులో సవాలు చేయగా పిటీషనర్‌ను ఉద్యోగం నుండి తొలగిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఆరోపణలు అంగీకరించినపక్షంలో పిటీషనర్ భావి జీవితంపై ప్రభావం చూపుతాయని కోర్టు పేర్కొంది. అదొక మచ్చగా వుండి పిటీషనర్ యొక్క భవిష్యత్తును దెబ్బతీసే అవకాశం వున్నందున సహజ న్యాయ సూత్రాల ప్రకారం పిటీషనర్ తన వాదన వినిపించుకునేందుకు సంబంధిత అధికారులు అవకాశం ఇచ్చి వుండాల్సిందని కోర్టు తెలిపింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అండ్ అదర్స్ ఎదిరి మృత్యుంజయ్ సర్కార్ అండ్ అదర్స్ (1996) 8ఎస్‌సిసి280) వ్యాజ్యములో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. వివిధ ఆరోపణలతో ఒక వ్యక్తిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నపుడు తన వాదనలను వినిపించే అవకాశం ఇవ్వకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సుప్రీం కోర్టు ఆ కేసులో పేర్కొన్న విషయాన్ని హై కోర్టు ఈ సందర్భంగా ఉటంకించింది కె.సి.జోషి ఎదిరి యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అదర్స్ (1985) 3ఎస్‌సిసి153) వ్యాజ్యములోను అలాగే మంగల్ సింగ్ ఎదిరి ఛైర్మెన్ నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అండ్ అదర్స్ (2009 ఎస్‌సిసి ఆన్‌లైన్ డిఈ ఎల్ 2345) వ్యాజ్యములోను సుప్రీం కోర్టు ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు హైకోర్టు పేర్కొంటూ తాత్కాళిక ఉద్యోగి అయినా సరే ఆరోపణలతో ఉద్యోగం నుంచి తొలగించినపుడు అది ఆ ఉద్యోగిపై మచ్చగా మిగులుతుందని, తగిన విచారణ జరపకుండా ఉద్యోగిని తొలగించడానికి వీల్లేదని ఫహీన్ ఎదిరి యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ అండ్ అందర్స్ 2003 (ఎస్‌యుపిపి) జెకెజె 235) వ్యాజ్యములో సుప్రీం కోర్టు పేర్కొన్న విషయాన్ని కూడా హైకోర్టు పేర్కొంది. మంగల్ సింగ్ ఎదిరి ఛైర్మెన్ నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అండ్ అదర్స్ (2009) ఎస్‌సిసి ఆన్‌లైన్ డిఈఎల్ 2345) వ్యాజ్యములో పిటీషనర్ కాంట్రాక్టు పద్ధతిపై నియమితులు కాగా శాఖా పరమైనట్టి విచారణ లేకుండా ఉద్యోగిని ఆరోపణలతో మాత్రం తొలగించడాన్ని కోర్టు తప్పుపట్టిన విషయాన్ని కూడా హైకోర్టు ఈ తీర్పులో ఉదహరించింది. ఈ కేసులో అంశాలను పరిగణన లోనికి తీసుకొని పిటీషనర్ తన వాదనను వినిపించుకునే అవకాశం ఇవ్వకుండా కాంట్రాక్టు రద్దు చేసుకుంటూ ఉద్యోగం నుండి తొలగిస్తూ జారీ చేసిన ఆదేశాలను హై కోర్టు ఈ మేరకు కొట్టివేసింది. ఇలాంటి ఆదేశాలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొం టూ సంబంధిత అధికారులు విచారణ జరిపి అందుకనుగుణమైన ఆదేశాలు జారీ చేయాలని రెండు రావాలలోగా పిటీషనర్‌కు సమాధానం ఇవ్వాలని కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పేర్కొనింది (ఎస్‌బిటిఎస్ దేవి ఎదిరి స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండ్ అదర్స్ డబ్ల్యుపి 6396/2024).

## రైతులు జాగ్రత్త చర్యలు చేపట్టండి



**దువ్వూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వల్ల వర్షం కొద్దికొద్దిగా వస్తుందని అందువల్ల రైతులు తమ పంట పొలాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మదిరేపల్లె, బాలాయపల్లె గ్రామల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా గ్రామంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కేపీ ఉల్లి పంటను పరిశీలించారు. వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో ఉల్లి కోదు తెగులు వస్తుందని దీనివల్ల కొనలు నల్లగా మారిపోతాయన్నారు. దీనికి తగు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షంతో ఎక్కడైనా వరి పైరు నేలవాలితే వాటిని పైకి తీసి కట్టలు కట్టుకోవాలని సూచించారు. అలాగే రైతులకు సబ్బిడీపై డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామల రైతులు, ఉద్యానవన సహాయకురాలు గంగా తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష



**దువ్వూరు, నవంబర్ 03, ప్రభాతవార్త:**

ఈనెల 5వ తేదిన మండలంలోని తాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతున్నందున అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి అధికారులచే మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ ఇక్బాల్ బాష మాట్లాడుతూ మండలంలో కేసీ కాలువ కింద 3నీటి సంఘాలు ఉన్నాయని అలాగే రెండు చెరువులకు సంబంధించిన సంఘాలు ఉన్నట్లు తెలిపారు. అయిదు సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఇప్పటికే ఎన్నికల అధికారులు నియమించి శిక్షణ కార్యక్రమం కూడ పూర్తి చేశామన్నారు. నామినేషన్ల స్వీకరణ, ఉప సంహరణ, పరిశీలనలో పోలింగ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీటి సంఘానికి పోటీ చేసే సభ్యులు తప్పనిసరిగా తమ భూములకు సంబంధించిన నీటి పన్నును చెల్లించ వలసి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈ పవన్‌కుమార్, జమాల్ వల్లి, డిప్యూటి తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జాన్సన్ పాల్గొన్నారు.

## కన్నెమడుగు సంఘమిత్ర వివాదం రచ్చ.. రచ్చ!

**తంబళ్లపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



మండలం కన్నెమడుగు సంఘమిత్ర వివాదం మరో మారు రచ్చకెక్కింది. గతంలో సంఘమిత్రగా ఎన్నికైన సృజనను కాదని గ్రామంలోని మరో వర్గం మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఫిర్యాదుల పరంపర కొనసాగి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొని వివాదం రచ్చకెక్కింది. ఈ విషయమై మంగళవారం కన్నెమడుగు పంచాయతీ కార్యాలయంలో మరో మారు ఏపీఎం గంగాధర్ నేతృత్వంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన నేటి సంఘమిత్రను కొన్నాల్లు కొనసాగించి చూడాలని సర్దిచెప్పినా ప్రయోజనం లేకపోయింది. కొందరు వీవో లీడర్లు వ్యతిరేకించడంతో వివాదం మొదలైంది. ఇదే సమయంలో సంఘ మిత్ర వర్గం, వ్యతిరేకవర్గం నాయకులు కార్యాలయం బయట ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకోవడంతో అక్కడ పరిస్థితి విషమించి రచ్చ రచ్చగా మారింది. ఈ వివాదం పసిగట్టిన పోలీసులు సర్దిచెప్పి చూసినా ఫలితం లేకపోయింది. విధి లేని పరిస్థితుల్లో ఏపీఎం గంగాధర్ సంఘమిత్ర నియామక ప్రక్రియను ఆపి తిరుగు ముఖం పట్టారు. ఈ సంఘమిత్ర నియామక ప్రక్రియ రాజకీయ రంగు పులుముకోవడంతో ఈ ఎన్నిక అధికారులకు తలనొప్పిగా మారింది. పట్టమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం చందాన అధికారుల పరిస్థితి మారింది. ఈ ఎన్నికను ఇరువర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రక్రియలో సీసీ నరసింహులు, వీవో సభ్యులు పాల్గొన్నారు.

## వంద శాతం అక్షరాస్యతే అందరి లక్ష్యం

**తంబళ్లపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండలంలో వంద శాతం అక్షరాస్యత సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలు, మహిళా సంఘాలు, సచివాలయ సిబ్బందికి అక్షరాస్యత సాధనపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సంబంధిత శాఖల ప్రతినిధులు తమ పరిదిలోని నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో థామస్ రాజా, ఏటీఎం గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ నాయక్, సూపర్‌వైజర్లు రాధ, అంగన్‌వాడీలు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## రేపు అనంతగిరి క్షేత్రంలో ఓంకార స్థాపన

**బద్వేలు అర్బన్, డిసెంబర్03 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలోని అనంతగిరి క్షేత్రంలో బుధవారం ఉదయం ఓంకార స్థాపన వాస్తు పూజా మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గురుస్వామి బలపనూరు శంభూ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.44 గంటల నుంచి ఈ కార్య క్రమాన్ని బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆద్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాంగా ఉదయం 10 గంటలకు ఓంకార క్షేత్ర గిరి పై గౌరవసత్కారం నిర్వహించిన తార్వల మధ్యాహ్నం 1 గంటలకు భోజన ప్రసాదము ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణిలీలా కైవల్య హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఇల్లు దెబ్బతిన్న నిరుపేదకు ఆర్థిక సాయం

**ఓబులవారిపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు దళితవాడకు చెందిన మనీ అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో సీనియర్ నాయకులు నాగశివశంకర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే సాయంకాలం దినపత్రిక విలేకరి చెన్నయ్య ఇంటికి సంబంధించిన మరమ్మతులు చేయిస్తానని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. దాతలు ముందుకు వచ్చి ఈ నిరుపేదకు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నందున పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సుబ్బన్న జంగల్ నాయుడు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల రహదారులు గుంతలు

**ఓబులవారిపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లి మండలంలోని పలు పంచాయతీల్లోని గ్రామీణ రహదారులు గుంతలతో గుల్లయ్యాయి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రయాణం అసౌకర్యంగా ఉందంటూ అటు ప్రయాణికులు ఇటు పాదాచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పుడైనా సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామీణ రహదారులు రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజా అవసరాలు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా పంట పొలాలు వద్దకు వెళ్లే రహదారులు కూడా బురదమయమై గుంతలు గుంతలుగా మారడంతో ఆ రోడ్డున వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అన్ని విధాలా గ్రామీణ రహదారులకు మోక్షం వచ్చేలాలా పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రెవెన్యూ సదస్సులలో ప్రజల సమస్యలు పరిష్కరించుకోవాలి

**ఓబులవారిపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి 8 వరకు మండల స్థాయి రెవెన్యూ సదస్సులు నిర్వ హించడం జరుగుతుందని ఈ సదస్సులో ప్రజా సమస్యలు పరిష్కరిం చుకోవాలని తహసీల్దార్ శ్రీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకా శాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని రాజకీయ నాయకులు అన్ని శాఖల అధికారులు హాజరై రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తెలిపారు.

## జూదరులు అరెస్ట్

**పెండ్లిమర్రి, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

కడప సబ్ డివిజన్ డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కడప రూరల్ సీఐ ఆధ్వర్యంలో పెండ్లిమర్రి ఎస్సై జి.మధుసూదన్‌రెడ్డి వారి సిబ్బంది పెండ్లిమర్రి మండలం గంగనపల్లి గ్రామ పరిసరాలలో ఊరి బయట ముళ్ల పొదల్లో జూదం ఆడుతున్న 11 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి పేక ముక్కలను మరియు రూ.59390 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



**సిద్దవటం, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన సిద్దవటం పోలీసు స్టేషన్‌లో మంగళవారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో ప్రశాంతత వాతావరణం ఉండాలని కక్షపూర్వత గొడవలకు పాల్పడి సాంఘిక కార్యక్రమాలు చేపడితే కఠినమైన చర్యలు తప్పవని ఆయన అన్నారు. మాచుపల్లి, దేగనవారిపల్లి, నేకనాపురం తదితర గ్రామాల్లో పూర్తిస్థాయి నిఘా వేసి ఉంచామని ఎటువంటి గొడవలు దిగినా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సై చిరంజీవి స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక పద్ధతిలో అధిక దిగుబడులు



**కెవిపల్లి డిసెంబర్ 03 ప్రభాతవార్త**

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడం వలన అధిక దిగుబడును సాధిం చవచ్చునని ఏవో చంద్ర నాయక్ అన్నారు. మండలంలోని గరినిమిట్టపం చాయతీలు మల్లారపు వాండ్లపల్లె లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటకు జిప్సం, వరికి పొటాష్, వాడకం వల్ల పంట దిగుబడి నాణ్యత గా ఉంటుందన్నారు కొత్త వంగడాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో పీలేరు ఏ డి ఏ వైవి రామారావు, ఏవో కరుణాకర్ రెడ్డి శ్రావణి శాస్త్రవేత్తలు మంజుల పీరు సాహెబ్, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 7వసారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్న నాగేశ్వర్‌రెడ్డి

**బద్వేలు అర్బన్, డిసెంబర్03 ప్రభాతవార్త :**



బద్వేలు పట్టణంలో ఏ సమయంలో అయినా రక్తం అత్యవసరమని తెలిసిన వెంటనే స్పందించి ముందుకు వచ్చి 7వ సారి రక్తదానం చేసి బ్లడ్ డోనర్ గ్రూప్ అడ్మిన్ పోకల నాగేశ్వరరెడ్డి తన మానవత్వాన్ని చాటుకోవడంపై పలువురు ఆయనను అభినందించారు. మంగళవారం నాగేంద్ర ఆసుపత్రిలో ఒకరికి రక్తం అత్యవసరమని తెలిసిన వెంటనే ఆసుపత్రిలో పోకల నాగేశ్వర్‌రెడ్డి రక్తదానం చేశారు. బద్వేలు పట్టణంలో గత 4, 5 సంవత్సరాలుగా బ్లడ్ డోనర్స్ గ్రూప్ ఆద్వర్యంలో అనేక రకాల గ్రూపుల రక్తాన్ని అత్యవసర సమయంలో రక్తంఅందించడంపై పట్టణంలో పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బ్లడ్ డోనర్ గ్రూప్ అడ్మిన్ పోకల నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం అందించేందుకు తమ గ్రూపు సభ్యులు ఎప్పుడూ ముందుంటారని ఆయన పేర్కొన్నారు.

## కుమ్మరికొట్టాల ఎస్టీ కాలనీలో వెలిగిన విద్యుత్ దీపాలు

-మున్సిపాలిటీ అభివృద్దే లక్ష్యం

-కమిషనర్ నరసింహారెడ్డి

**బద్వేలు అర్బన్, డిసెంబర్03 ప్రభాతవార్త :**



బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరకొట్టాల ఎస్టీ కాలనీలో గత రెండు మాసాలు విద్యుత్ దీపాలు వెలగడం లేదని అక్కడి స్థానికులు తెలపడంతో మంగళవారం వార్త దిన పత్రికలో 'అంధకారంలో కుమ్మరికొట్టాల ఎస్టీ కాలనీ'పేరుతో మంగళవారం శీర్షిక వెలువడిన విషయం విధితమే. కాగా ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి సంబంధిత కాలనీకి చేరుకుని మున్సిపల్ సిబ్బందితో విద్యుత్ దీపాలను రిపేరు చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని, అందుకు తాను ఎల్లవేళలా కృషిచేస్తానన్నారు. అయితే ఇందుకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ మున్సిపాలిటీ మనందరని గుర్తించి ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలు పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు.

## అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం

**సిద్దవటం, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామ నివాసి మల్లేష (55)కు మంగళవారం రాత్రి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన సుబ్బరాయుడు(డీలర్) జింకా ఓబులేసు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదేశాల మేరకు వికలాంగునికి తన వంతు సహాయంగా ఆర్థిక సాయం అందించడం జిగిందన్నారు. కుటుంబ పోషణ జరగక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అతనికి సహాయం చేశామన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

## పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలి

**సిద్దవటం, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలం పొన్నఓలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో పంటల సాగు చేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా మండల అగ్రికల్చర్ ఈవో రమేష్‌రెడ్డి మంగళవారం మాట్లాడుతూ పంటల బీమా ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టం ఉత్పత్తుల కొనుగోలు తదితర ప్రభుత్వ ప్రయోజనాలు రైతులు పొందాలంటే తప్పనిసరిగా ఈ పంట నమోదు ఉండాలని పంట నమోదు తరువాత రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు లాగిన్‌లో సాగు ధ్రువీకరణ జనరేట్ అవుతుందని ఒరైతులు ఈ విషయాన్ని గమనించాలని వ్యవసాయ శాఖ అమలు పరుస్తున్న పథకాలపై తెలియజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏ కిశోర్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయండి

**సిద్దవటం, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. లింగంపల్లి వీఆర్‌ఏపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మంగళవారం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లింగంపల్లి వీఆర్‌ఏగా పనిచేస్తున్న కిషోర్ చిన్న స్థాయి ఉద్యోగి అధికారుల ఆదేశాలతో స్థానిక వీఆర్వో వీఆర్‌ఏ విధి నిర్వహణలో భాగంగా భూసమస్యపై విచారణ నిమిత్తం సోమవారం సాయంత్రం వెళ్లగా నిమ్మకాయల, ఓబుల్‌రెడ్డి, అతనిపై దాడి చేయడంతో రక్త గాయాలైన అతను మెరుగైన వైద్య పరీక్షలు నిమిత్తం రిమ్స్‌లో అడ్మిట్ అయ్యాడని ఒక దలిత వ్యక్తి వీఆర్‌ఏపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటపతి, మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి మృతులకు ఘన నివాళులర్పించిన కళాశాల సిబ్బంది



**కడప డిసెంబర్ 3 ప్రభాతవార్త:**

భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి నేటికి 40 ఏండ్లు అయిన సందర్భంగా మంగళవారం లీక్ అయిన గ్యాస్ పీల్చి అసువులు బాసిన వేల మంది స్మృత్యర్థం కే ఎల్ ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి మృతులకు ఘన నివాళి అర్పించారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి రత్నమ్మ, అన్ని శాఖల విభాగాధిపతులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జాన్ దేవానంద్,వ్యాయామ ఉపాధ్యాయురాలు గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## లంచాలకు స్వస్తి చెబుదాం



**పీలేరు డిసెంబర్ 03 ప్రభాతవార్త ః**

పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో లంచాలకు స్వస్తి పలుకుదామని పంచాయతీ కార్యదర్శి గురు మోహన్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో ఆయన గ్రామ పంచాయితీ, గ్రామ ఉద్యోగులు, సిబ్బంది చేత తాము లంచాలకు దూరమని, తాము అవినీతి అక్రమాలకు పాల్పడకుండా, ఎవరి నుంచి కూడా ఎలాంటి లాభాపేక్షలను ఆశించకుండా ప్రజలకు సేవలు అందిస్తూ, ఉత్తమ ఉద్యోగులు సిబ్బందిగా ప్రజలకు చేరు అవుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా కార్యాలయం బయట బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గురు మోహన్ మాట్లాడుతూ అవినీతి రహిత గ్రామపంచాయతీ కార్యాలయంగా పీలేరు గ్రామపంచాయతీని తీర్చిదిద్దుతామన్నారు. తమ సిబ్బంది ఎవరూ లంచాలు తీసుకోకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉద్యోగులతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం



**ప్రొద్దుటూరు అర్బన్,డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఖాదర్ బాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధుగోపాలకృష్ణ ప్రొద్దుటూరు క్లబ్ ప్రెసిడెంట్ బాలసూర్యారావ్ కార్యదర్శి శ్రీధర్ శర్మ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై ప్రసాద్ రెడ్డి పాఠశాల స్థల దాత వెంకటేశ్వర్లు చేతుల మీదుగా మంగళవారం సీతాఫలం నేరేడు జామాయిల్ తదితర 50 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రోటరీ డిస్టిక్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ మొక్కల పెంపకం అనివార్యమని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి భావితరాల మన వారసులకు బాసటగా నిలవాలని రోటరీ క్లబ్ ప్రపంచంలోనే పెద్ద సేవా సంస్థ అని రోటరీ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలియజేశారు. పదవ తరగతిలో 2024 25 వ సంవత్సరంలో పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి 5000 రూపాయలు సాధు గోపాలకృష్ణ బహుమానంగా ఇస్తానని ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ 3000 రూపాయలు బహుమానంగా ఇస్తానని మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీధర్ శర్మ 3000 రూపాయలు ఇస్తానని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సెక్రటరీలు ఆ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇబ్బంది రాగుల సురేష్, రామాంజనేయులు, సుభద్ర, శ్రీదేవి, బుజ్జమ్మ, పర్యావరణ మిత్ర రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, గుర్రం రామకృష్ణ, కొవ్వూరు రవికుమార్ రెడ్డి, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ తుకారం, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దివ్యాంగులకు భవిత కేంద్రం సంక్షేమ నిలయం

**తంబళ్లపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**



తంబల్లపల్లె మండల కేంద్రంలోని భవిత కేంద్రం దివ్యాంగులకు సంక్షేమ నిలయంగా నిలిచినట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆయన భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి పిల్లలకు పంపిణీ చేసి శుబాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులు తమ లోపాలపై బాధపడకుండా భవిత కేంద్రంలో చేర్చి శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నాగ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు రేఖ, శ్రావణి, ఫిజియోథెరపీ సరల, తంబళ్లపల్లె హైస్కూలు హెచ్‌ఎం శ్రీనివాసులు, హరిజనవాడ హెచ్‌ఎం సాంబశివ, ఫోర్డు నరసింహులు, సీఆర్పీలు సుధాకర్, బాలకృష్ణ, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరగాలి



**తంబళ్లపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:**

మండలంలో 8న జరిగే సా గునీటి సంఘాల ఎన్నికలు ఎన్నిక ల అధికారులు సజావుగా జరగడా నికి సహకరించాలని ప్రధాన ఎన్ని కల అధికారి ఇరిగేషన్ ఈఈ సు రేష్‌బాబు, ఏఈ సతీష్ కుమార్ గౌడ్‌లు సూచించారు. మంగళవారం మండలంలోని 11 సాగునీటి సంఘాలపై ఈనెల 5వ తేదీ నామినేషన్ల పర్వం అనంతరం 8న ఎన్నికలు జరుగుతాయన్నారు.